ధాన్యం కొనుగోళ్లు ఎన్నడో?

- ఉమ్మడి బాల్కొండ మండల పరిధిలో వరి కోతలు షురూ!
- ఇప్పటికీ ప్రారంభంకాని కొనుగోలు కేంద్రాలు


నాగంపేట్ శివారులో ఆరబెట్టిన ధాన్యం

బాల్కొండ: వరి పంట చేతికి రావడంతో రైతులు అక్కడక్కడ వరి కోతలను షురూ చేశారు. కానీ ప్రభుత్వం ఉమ్మడి బాల్కొండ మండలంలో ఇప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దీంతో వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

మద్దతు ధర ప్రకటించినా..

ప్రస్తుత సంవత్సరం వరి పంటను రైతులు అధికంగా సాగు చేశారు. అక్టోబర్ చివరి నుంచి నవంబర్ మధ్య మాసం వరకు వరి కోతలు జోరందుకునే అవకాశం ఎక్కువగా ఉంది. ప్రస్తుతం ముందస్తుగా సాగు చేసిన పంటలు చేతికందాయి. ప్రభుత్వం క్వింటాలుకు రూ.2300ల మద్దతు ధరను ప్రకటించింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సకాలంలో ప్రారంభిస్తే రైతులకు మద్దతు ధర దక్కుతుంది. కొనుగోలు కేంద్రాలు ఉంటే వ్యాపారులు సైతం అందుకు అనుగుణంగా ధరను చెల్లించి కొనుగోలు చేస్తారు. అదే కొనుగోలు కేంద్రాలు లేకపోతే వ్యాపారులు ధరను తగ్గించి రైతులను నట్టేట ముంచుతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిసారి ఆలస్యంగానే..

గతంలో బాల్కొండ, వేంపల్లి, రెంజర్ల సహకార సంఘాల పరిధిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మెండోరా మండలంలో మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. సావెల్ సహకరా సంఘం ద్వారా కూడ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కూడ అవే కొనుగోలు కేంద్రాలు ఏర్పడే అవకాశం ఉంది. ప్రతి సంవత్సరం ఆలస్యంగా వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, ఆలస్యంగా మూసివేస్తున్నారు. దీంతో రైతులు వ్యాపారులకు, దళారులకు వరి ధాన్యం విక్రయించుకుని నష్టపోతున్నారు. ప్రస్తుత అలా జరగకుండ సకాలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

సకాలంలో ఏర్పాటు చేయాలి

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం సకాలంలో ఏర్పాటు చేయాలి. లేదంటే రైతులు తక్కువ ధరకే ధాన్యాన్ని దళారులకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడుతుంది. తుఫాన్ ఉందంటు ప్రచారం జరగడంతో ఇంకా ఆందోళనగా ఉంది. అధికారులు వెంటనే స్పందించాలి.

– లింగారెడ్డి, రైతు, నాగంపేట్

త్వరలో ప్రారంభిస్తాం..

ఉమ్మడి బాల్కొండ మండల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరలో ప్రారంభిస్తాం. సొసైటీల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేలా ఆదేశాలు వచ్చాయి. ఆదేశాల ప్రకారం ఆయా ప్రాంతాల్లో కేంద్రాలను ప్రారంభిస్తాం. రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు.

– శ్రీధర్, తహసీల్దార్, బాల్కొండ

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం


కోటగిరిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాసుల బాలరాజు


నందిపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ సుదర్శన్

రుద్రూర్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కోటగిరిలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, తొందరపడి తక్కువ ధరకు దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. మద్దతు ధరతోపాటు సన్నాలకు బోనస్ కూడా ప్రకటించందన్నారు. నియోజకవర్గం అభివృద్ధితో పాటు ప్రజల సమస్యల పరిష్కారం కోసం నాయకులు విబేధాలు మాని కలిసిమెలిసి పని చేయాలన్నారు. రాష్ట్ర అగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే పోచారంతో కలిసి, మరింత అభివృద్ధి సాధించుకునేందుకు కార్యకర్తలు, నాయకులు కలిసి రావాలని కోరారు. విండో చైర్మన్ కూచి సిద్దు, ఏఎంసీ చైర్మన్లు హన్మంతు, సురేష్ బాబా, ఏవో శ్రీనివాస్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

నందిపేట్ మండలంలో..

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని ఐలాపూర్, చిమ్రాజుపల్లి సొసైటీ పరిధిలోని గ్రామాలలో శుక్రవారం ఆయా సొసైటీల చైర్మన్లు మీసాల సుదర్శన్, బొంకం గంగారెడ్డిలు వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. డైరెక్టర్లు, సొసైటీ సీఈవోలు నరహరి, పిస్క నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి వర్ని మండలంలో..

వర్ని: మోస్రా మండలం గోవూర్, చందూర్ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను వర్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సురేష్ బాబా ప్రారంభించారు. గోవూరు సహకార సంఘం అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. జాకోరా సొసైటీ పరిధిలోని పైడిమల్, జలాల్పూర్, జాకోరాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జాకోరా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు బార్దవల్ దశరథ్ ప్రారంభించారు. ఉపాధ్యక్షుడు గఫర్, నాయకులు బద్య నాయక్, వెంకటిగౌడ్, కన్నా శంకర్ పాల్గొన్నారు.

కమర్‌పల్లి మండలంలో సోయా కొనుగోలు కేంద్రం..

కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ రేగుంట దేవేందర్, ఏఎంసీ చైర్మన్ నర్సయ్య ప్రారంభించారు. ప్రభుత్వం సోయాబీన్ క్వింటాలకు రూ. 4892 మద్దతు ధర నిర్ణయించినట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చే సోయలు తేమ శాతం 12లోపు ఉండాలని వారు అన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, నాయకులు తిప్పిరెడ్డి శ్రీను, అవారి సత్యం, బోనగిరి లక్ష్మణ్, కొమ్ముల రవీందర్‌రెడ్డి, బద్దం చిన్నారెడ్డి సీఈఓ శంకర్ పాల్గొన్నారు.


గోవూరులో..


జాకోరాలో..


ఉప్లూర్‌లో సోయాబీన్ కొనుగోలు కేంద్రం..

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


గగ్గుపల్లిలో పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది


కందకుర్తి గ్రామంలో..


అక్బర్‌నగర్‌లో..

పెర్కిట్/రుద్రూర్/రెంజల్/నవీపేట/బాల్కొండ/వేల్పూర్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం ఆయా నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో పశువైద్య సిబ్బంది పశువులకు టీకాలు వేశారు. ఆలూర్ మండలం గగ్గుపల్లి గ్రామంలో పశు వైద్యాధికారి సందీప్ పశువులకు టీకాలు వేశారు. రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ గ్రామంలో పశువైద్యాధికారి సంతోష్‌రెడ్డి, పోతంగల్ మండలం టాక్లీ గ్రామంలో వెటర్నరి వైద్యుడు సురేష్ కుమార్ టీకాలు వేశారు. రెంజల్(మండలంలోని కందకుర్తి గ్రామంలో పశువులకు గాలికుంటు టీకాలను నీలా విండో చైర్మన్ ఇమాంబేగ్, మండల పశు వైద్యాధికారి విఠల్ కలిసి వేశారు. ముప్కాల్ మండల కేంద్రంలో మండల పశు వైద్యాధికారి గౌతంరాజు, వేల్పూర్ మండలం కుకునూర్, కోమన్‌పల్లి గ్రామాలలో మండల పశువైద్యాధికారి సంతోష్‌రెడ్డి టీకాలు వేశారు.


టాక్లీ గ్రామంలో..


కోమన్‌పల్లిలో..


ముప్కాల్ మండల కేంద్రంలో..

బస్సు యాత్రను జయప్రదం చేయండి



వేల్పూర్: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించే బస్సు యాత్ర, బహిరంగ సభ ను విజయవంతం చేయాలని ఆల్ మాల స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అంగరి ప్రదీప్ కోరారు. మండల కేంద్రంలోని మాల సంఘాల సభ్యులతో శుక్రవారం ఆయన స మావేశం నిర్వహించి, మాట్లాడారు. ఎస్సీ వర్గీ కరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ చేపట్టిన మాలల బస్సు యాత్ర హైదరాబాద్ నుంచి శనివారం నిజామాబాద్‌కు చేరుకుంటుందన్నారు. ప్రజలు అ ధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పులి సాయిరాం, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



నవీపేట: కోతలు ఆరంభమైన సమయంలో గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బినోల సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు కోరారు. ఈమేరకు శుక్రవారం ఆయన తహసీల్దార్ వెంకట రమణకు వినతిపత్రం అందజేశారు. సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి మోసపోతున్నారన్నారు. తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సమాచారం..

నేడు కరెంట్ కోత

బోధన్: సాలూర మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంట్ కోత ఉండనున్నట్లు విద్యుత్ శాఖ బోధన్ డీఈ ముక్తార్, సబ్ డివిజన్ ఏడీఈ నగేష్ కుమార్, ఏఈ కళ్యాణ్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని ఆరు గ్రామాలు సాలూర, సాలూర క్యాంప్, ఫత్తేపూర్, తగ్గెల్లి, జాడి జమాల్ పూర్, కొప్పర్తి క్యాంప్ గ్రామాల్లో సాయంత్రం 3గం.లనుంచి 5గం.ల వరకు కరెంట్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వారు తెలిపారు.

నేడు నగరానికి ఎంపీ ఈటల రాజేందర్ రాక

సుభాష్‌నగర్: జిల్లాకేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగే జిల్లాస్థాయి సభ్యత్వ నమోదు సమీక్షా సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరుకానున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ శ్రేణులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

బీజేపీ సభ్యత్వ నమోదు



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పార్టీ నేతలు చేపట్టారు. నాయకులు యామాద్రి భాస్కర్, కొత్తూరు గంగాధర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ సభ్యత్వ నమోదు చేపట్టారు. నడిశరం మల్లయ్య, అరుణ్, సురేష్ గౌడ్, చౌల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఫిర్యాదు సరికాదు



ఆర్మూర్‌టౌన్: బీఆర్ఎస్ నాయకులు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేయడం సరికాదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బీజేపీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎమ్మెల్యే మాట్లాడలేదన్నారు. నాయకులు ప్రకాష్, కిరణ్, కలిగోట ప్రశాంత్, రాజ్‌కుమార్, నరేష్‌చారి పాల్గొన్నారు.

డీఈగా బాధ్యతల స్వీకరణ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో గల విద్యుత్ డివిజినల్ కార్యాలయంలో నూతన డీఈగా పీవీ రాజేశ్వర్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రం నుంచి బదిలీపై ఆయన ఆర్మూర్‌కు ఆపరేషన్ డీఈగా వచ్చారు. 1104, 327 యూనియన్ నాయకులు ఆయనను సత్కారించారు. ఏడీఈలు కృష్ణ, శ్రీనివాస్, వినోద్, ఏఏవో మోహన్, యూనియన్ నాయకులు సంజీవ్, నరేందర్ నాయక్, సల్ల శ్రీనివాస్, చందర్‌నాయక్‌గంగారాం, ప్రదీప్‌గౌడ్, సురేష్‌బాబు, నర్సయ్య, వేణుగోపాల్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గోడప్రతుల ఆవిష్కరణ

వర్ని: చందూర్ మండల కేంద్రంలో శుక్రవారం 'టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభ' వాల్ పోస్టర్లను ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు మల్లేష్ ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో ఈ నెల 20న జరిగే విలీన మహాసభలకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నాయకులు భారతి, విజయ, జ్యోతి, రేఖ, అనిత, సంజీవ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని దేశాయి బీడీ కంపెనీలో శుక్రవారం ఐఎఫ్‌టీయూ విలీన మహాసభల వాల్‌పోస్టర్లను రాష్ట్ర కార్యదర్శి ముత్తెన్న ఆవిష్కరించారు. నాయకులు నజీర్, మనోజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను ఇవ్వాలి

బాల్కొండ: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం వెంటనే అందించాలని టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షుడు సత్యానంద్, ప్రధాన కార్యదర్శి రమేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2022నుంచి ఇప్పటివరకు రావాల్సిన 5డీఏలను తక్షణమే ప్రకటించాలన్నారు. ఈనెల 23న నిర్వహించే కేబినేట్ సమావేశంలో కనీసం 4డీఏలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

హామీలను అమలు చేయాలి



ఆర్మూర్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. పట్టణంలోని కమలనెహ్రూ కాలనీలోగల మెడికల్ భవన్‌లో శుక్రవారం సీపీఎం ఐదవ మహాసభ నిర్వహించారు. ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి వెంకటేష్ పార్టీ జెండాను ఆవిష్కరించి, అమర వీరులకు నివాళులు అర్పించారు. రమేష్‌బాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. నాయకులు పెద్ది వెంకట రాములు, లింగం, భూమన్న, కుతాడి ఎల్లయ్య ఉన్నారు.

తాడెంలో ఊరపండుగ ప్రారంభం

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఠాణాకలన్ గ్రామంలో ఐదేళ్లకు చేసే ఊర పండుగ కోసం శుక్రవారం గ్రామస్తులు దేవతలకు ముడుపులు కట్టారు. మూడు రోజులలో ముడుపులను తీసి ఊరపండుగా చేస్తారని చెప్పారు. గ్రామస్తులకు ఎలాంటి కీడు జరగకుండా ఈ పండుగ నిర్వహిస్తారని వీడీసీ ప్రతినిధులు తెలిపారు.

సంక్షిప్తం

కానిస్టేబుల్‌కు ఘన నివాళి



పెర్కిట్(ఆర్మూర్): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలూర్‌లో అమరుడైన కానిస్టేబుల్ బొప్పన గణేష్ చిత్రపటానికి ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి శుక్రవారం ఘన నివాళులు అర్పించారు. అనంతరం కానిస్టేబుల్ కుటుంబాన్ని ఓదార్చారు. ఎస్‌హెచ్‌వో పురుషోత్తం, మాజీ సొసైటీ చైర్మన్ కళ్లెం భోజా రెడ్డి, బొప్పని విజయ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్ మోడల్ స్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి తంకూర్ సౌరభ్ రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జీ అప్పారావు శుక్రవారం తెలిపారు. త్వరలో హైదరబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా సౌరభ్‌ను ప్రిన్సిపల్ శ్యామ్, పీడీ అప్పారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థికి ఆర్థికసాయం అందజేత



పెర్కిట్(ఆర్మూర్): ఉన్నత చదువుల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కుంటున్న పెర్కిట్‌లోని శశాంక్ అనే బీబీఏ విద్యార్థికి శుక్రవారం ఈరవత్రి రాందాస్ ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు సదాక్ ప్రమోద్, బదాం రాజ్ కుమార్, సిరిగిరి జీవన్, ఈరవతి సురేందర్, హజారి సతీష్, దాసరి గోపికృష్ణ, ప్రవీణ్, సాయి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న లైన్‌మన్‌కు సన్మానం



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్‌లో లైన్‌మన్‌గా విధులు నిర్వహించి, బదిలీపై వెళ్తున్న శివను శుక్రవారం గ్రామ పంచాయతీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యదర్శి రాజలింగం, కారోబార్ సంతోష్, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఏడీఈకి..

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి ఏడీఈ బెనర్జీ బదిలీపై జనగాంకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఆయనను శుక్రవారం విద్యుత్ సిబ్బంది సన్మానించారు. ఆయన స్థానంలో నిర్మల్ నుంచి వచ్చిన ఏడీఈ ప్రభాకర్ ఎడపల్లి సబ్ డివిజన్ పరిధిలో బాధ్యతలు స్వీకరించారు. సబ్ ఇంజనీర్లు జావీద్, భూమేష్, పాషా, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పోతంగల్‌లో ఇండియన్ బ్యాంక్ ప్రారంభం

రుద్రూర్: పోతంగల్‌లో శుక్రవారం ఇండియన్ బ్యాంకును బ్యాంకు ఫీల్డ్ జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి, కరీంనగర్ జోనల్ మేనేజర్ రాజ్ కుమార్ ప్రారంభించారు. సిబ్బంది సిహెచ్ అర్వింద్, అశోక్ చౌవాన్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలో ప్రతిభ



బోధన్: తెలంగాణ యోగాసన క్రీడా అసోసియేషన్ ఇటీవల నిర్వహించిన 5వ రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో బోధన్‌లోని విజయ సాయి హైస్కూల్ విద్యార్థులు తేజస్, కపిల్ ,క్రాంతి, ఓంకార్ ప్రతిభ చాటారు. ఈసందర్భంగా బోధన్‌లో శుక్రవారం విద్యార్థులను సబ్ కలెక్టర్ వికాస్ మహతో అభినందించారు. ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ మాట్లాడుతూ. విద్యార్థులు జాతీయస్థాయి యోగాసన పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. తహసీల్దార్ విట్టల్, పాఠశాల మేనేజర్ చక్రవర్తి పాల్గొన్నారు.

చెరువుల నీటి నాణ్యత పరిశీలన



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌తో పాటు పెర్కిట్‌లో గల చెరువుల్లో శుక్రవారం నీటి నాణ్యతను ఫిస్టులిఫెరా సోలారిస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సభ్యులు అవంతి ఆచార్య, రీతూకొండూలు పరిశీలించారు. రానున్న రోజుల్లో నీటి నాణ్యతను పెంపొందించడం, జీవచరాలను రక్షించేందుకు చర్యలు చేపడుతున్నట్లు సంస్థ సభ్యులు పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ రాజు, డీఈ భూమేశ్వర్ సానిటరీ ఎస్సై గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి పాల్గొన్నారు.

పాఠశాలలో దంతవైద్య శిబిరం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని దుబ్బ జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్‌లో శుక్రవారం శీనునాయక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 350 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి అనంతరం వారికి దంత సంరక్షణపై అవగాహన కల్పించారు.

సదరం సర్టిఫికెట్ అందజేత



వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో ఐదేళ్లుగా బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న మాడవేడి కల్యాణ్ కు స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సదరం సర్టిఫికెట్ అందజేశారు. ఏఎంసీ డైరెక్టర్ బొంబాయి గంగాధర్, మాజీ సర్పంచులు దొరబాబు, రాజేశ్వర్, పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత



వేల్పూర్: మండలంలోని మోతె గ్రామానికి చెందిన రమణి వైద్య చికిత్స కోసం శుక్రవారం బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి రూ.2లక్షల ఎల్‌వోసీని అందజేశారు. ఎమ్మెల్యేకు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	జిగ్రా (తెలుగు)=11.30, 5.40 మానాన్న సూపర్‌హీరో(తెలుగు)-2.50, మార్టిన్(తెలుగు)-9.00
స్క్రీన్-2 –	దేవర పార్ట్-1 (తెలుగు) - 11.15 2.50 6.25 10.00
స్క్రీన్-3 –	వేట్టయన్ (తెలుగు) - 11.50, 3.20, 6.50, 10.20
స్క్రీన్-4 –	విశ్వం (తెలుగు)- 10.00, 4.15, 10.30, జనక అయితే గనక (తెలుగు)- 1.15, 7.30,

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఫిషియన్స్)

స్క్రీన్-1	విశ్వం (తెలుగు) - 10.20, 1.20, 4.20 10.30, దేవర పార్ట్-1 (తెలుగు)- 7.25
స్క్రీన్-2	కల్లుకంపౌండ్(తెలుగు)-10.40, జనక అయితే గనక(తెలుగు)-1.30, లవ్‌రెడ్డి (తెలుగు)-4.30, జిగ్రా(హిందీ)- 10.30
స్క్రీన్-3	వేట్టయన్(తెలుగు)- 10.30 4.35 7.40 10.40, ఖడ్గం(తెలుగు)-1.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	వేట్టయన్(తెలుగు)- 10:10 ది వైల్డ్ రోబోట్ (తెలుగు) - 1.40, 7.45, 10.15, దేవర పార్ట్-1(తెలుగు)- 4.10
స్క్రీన్-2	ది వైల్డ్ రోబోట్(తెలుగు)-10.30, విశ్వం (తెలుగు) - 1.00 7.15, జనక అయితే గనక (తెలుగు)-4.15 10.30
స్క్రీన్-3	ఇద్దరు (తెలుగు)-10.00, లవ్‌రెడ్డి (తెలుగు) - 1.00 7.30, వేట్టయన్ (తెలుగు) - 4.00, ఖడ్గం (తెలుగు) - 10.30
స్క్రీన్-4	రివైన్జ్(తెలుగు)-10.25, వీక్షణం(తెలుగు) - 1.20, జిగ్రా(హిందీ) -4.00, వేట్టయన్(తెలుగు)-10.40
లలితామహల్	దేవర పార్ట్-1(తెలుగు)
దేవి	జనక అయితే గనక (తెలుగు)
నటరాజ్	విశ్వం (తెలుగు)
విజయ్	వేట్టయన్(తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	79,100	వెండి (కిలో)	96,000
22 క్యారెట్స్	72,980	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800